క్లుప్తంగా

26న ట్రాక్టర్ల ర్యాలీ



విలేకరులతో మాట్లాడుతున్న జి.రామకృష్ణ

కర్నూలు(సెంట్రల్): కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ ఈనెల 26వ తేదీన దేశవ్యాప్తంగా సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ట్రాక్టర్ల ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ తెలిపారు. మంగళవారం కార్మిక, కర్షక భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కర్నూలులో కొత్తబస్టాండ్ నుంచి కలెక్టరేట్ వరకు ట్రాక్టర్లు, బైక్‌లు, ఆటోలతో ర్యాలీ నిర్వహిస్తామన్నారు. ఈ ర్యాలీలో పార్టీలకు అతీతంగా రైతులు, రైతు కూలీలు, రైతు సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మోదీ ప్రధానమంత్రి అయ్యాక వ్యవసాయ రంగ నిర్వీర్యమవుతోందన్నారు.రైతులను ఆదుకోవడానికి కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎండీ అంజిబాబు, నారాయణ పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన



పతకాలు సాధించిన జిల్లా కరాటే క్రీడాకారులు

కర్నూలు (టౌన్): ఇటీవల కర్ణాటక రాష్ట్రంలో జరిగిన రియల్ కరాటే ఛాంపియన్‌షిప్‌లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ కనబర్చి 12 పతకాలు సాధించారు. ఈనేపథ్యంలో మంగళవారం సాయంత్రం స్థానిక కొత్త బస్టాండ్ ఎదురుగా ఉన్న యూకాన్ కాంప్లెక్స్‌లో అభినందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు బి. రామాంజనేయులు ఆ క్రీడాకారులను అభినందించి మాట్లాడారు. కరాటే క్రీడాకారులు గణేష్, సందీప్, సుమేర్, రంజిత్ (బంగారు పతకం), ఉమర్ (వెండి పతకం), కుందన వరప్రసాద్, రేవంత్‌లకు (కాంస్య పతకాలు) రావడం సంతోషకరవిషయమన్నారు.

బీజేపీవి కుటిల రాజకీయాలు



నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

కర్నూలు(సెంట్రల్): రాహుల్‌గాంధీ భారత్ జోడో న్యాయ యాత్రకు బీజేపీ అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తూ కుటిల రాజకీయాలు చేస్తోందని డీసీసీ అధ్యక్షుడు కె.బాబురావు మండిపడ్డారు. మంగళవారం కాంగ్రెస్‌పార్టీ కార్యాలయం నుంచి గాంధీ విగ్రహం వరకు ర్యాలీగా బయలుదేరి మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పదేళ్లలో బీజేపీ ప్రజలకు చేసిన మేలు కన్నా నష్టమే అధికమన్నారు. మతాలు, కులాల మధ్య చిచ్చు పెట్టిందన్నారు.

డీసీసీ నూతన కార్యవర్గం ఏర్పాటు

డీసీసీ నూతన కార్యవర్గాన్ని అధ్యక్షుడు కె.బాబు రావు విస్తరించారు.అధ్యక్షుడిగా కె.బాబురావుతో పాటు8 మంది ఉపాధ్యక్షులు, 9 మంది ప్రధాన కార్యదర్శులు, 11 మంది కార్యదర్శులు, 23 మంది సహాయ కార్యదర్శులు, ఒక్కరు అధికార ప్రతినిధితో కలిపి మొత్తం 52 మందిని నియమించారు. కార్యక్రమంలో నాయకులు మాజీ మంత్రిమూలింటి మారెప్ప, డీసీసీ మాజీ అధ్యక్షుడు ఎం.సుధాకరబాబు, నాయకులు దామోదరం రాధాకృష్ణ, జాన్‌విల్సన్, బతుకున్న పోతుల శేఖర్,ఎస్. ప్రమీళ, సత్యనారాయణ గుప్తా పాల్గొన్నారు.

1,2 తేదీల్లో టూరిజం సర్వే మెథడాలజీపై వర్క్‌షాప్

కర్నూలు కల్చరల్: ఏపీ టూరిజం అథారిటీ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 1, 2 తేదీల్లో విజయవాడలో 'ఇంప్లిమెంటేషన్ ఆఫ్ టూరిజం సర్వే మెథడాలజీ ' అనే అంశంపై రెండు రోజుల పాటు వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు జిల్లా పర్యాటక శాఖ అధికారి విజయ తెలిపారు. గవర్నమెంట్ ఆఫ్ ఇండియా మినిస్ట్రీ ఆఫ్ టూరిజం సహకారంతో జరిగే ఈ వర్క్‌షాప్‌లో పర్యాటక శాఖ ప్రాంతీయ డైరెక్టర్లు, పర్యాటక శాఖ అధికారులు పాల్గొంటారన్నారు. జిల్లా నుంచి తను వెళ్తున్నట్లు తెలిపారు. ఇంపార్టెన్స్ ఆఫ్ టూరిజం స్టాటిస్టిక్స్ అండ్ ఇంట్రడక్షన్ టు కెపాసిటీ బిల్డింగ్ ఇన్పైట్, స్టడీ డిజైన్ అండ్ మెథడాలజీ ఆఫ్ ది టూరిజం సర్వే అండ్ ఎస్టిమేషన్ స్టాటిస్టిక్స్ అంశాల్లో అవగాహన కల్పిస్తారని ఆమె పేర్కొన్నారు.

కుమారస్వామికి పూజలు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు. స్వామి వారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

కృంగదీసే థైరాయిడ్ !

- థైరాయిడ్‌తో నిస్సారమైన జీవితం
- మందులు, వ్యాయామంతో నియంత్రణ
- జిల్లాలో 15 శాతం మందికి సమస్య
- జనవరి థైరాయిడ్ అవగాహన మాసం



థైరాయిడ్ గ్రంథి

కర్నూలు(హాస్పిటల్): ఆరోగ్య సమస్యల్లో థైరాయిడ్ ఒకటి. శరీరంలోని హార్మోన్‌స్థాయిల్లో తేడాల వల్ల వచ్చే ఈ వ్యాధి మగవారిలో కన్నా ఆడవారిలో రెట్టింపుగా కనిపిస్తుంది. శరీరంలోని ప్రతి అవయవంపై ప్రభావం చూపే ఈ వ్యాధి మనిషిని కృంగదీస్తుంది. ముందుగానే గుర్తించి చికిత్స తీసుకుంటే మేలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. జనవరి థైరాయిడ్ అవగాహన మాసం సందర్భంగా ప్రత్యేక కథనం.

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఎండోక్రైనాలజీ విభాగానికి ప్రతి వారం రెండురోజుల పాటు ఓపీ సేవలు ఉంటాయి. ఇందులో షుగర్, థైరాయిడ్, ఇతర హార్మోన్ సమస్యలతో వారానికి 800 మంది రోగులు చికిత్స కోసం వస్తారు. వారిలో కేవలం థైరాయిడ్ జబ్బుతో బాధపడే రోగులు 200 మంది దాకా ఉంటున్నారు. ఒక నెలకు 800 మంది థైరాయిడ్ రోగులు చికిత్స కోసం వస్తున్నారు. ఇందులో 500 మంది కొత్త రోగులు వస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు. ప్రైవేటు వైద్యుల వద్దకు సైతం ప్రతిరోజూ 80 మందికి పైగా థైరాయిడ్ బాధితులు చికిత్స కోసం వస్తున్నారు. ఈ మేరకు వారి వద్ద సగటున నెలకు 2వేల మంది చికిత్స పొందుతున్నారు. మొత్తం థైరాయిడ్ రోగుల్లో 70 శాతం మంది హైపో థైరాయిడ్, 30 శాతం మంది హైపర్‌థైరాయిడ్ బాధితులు ఉంటున్నారు. పిల్లల నుంచి పెద్దల వరకు ఈ సమస్య ఇప్పుడు బాధిస్తోంది. స్త్రీలలో 20 శాతం, పురుషులలో 15 మంది ఈ వ్యాధికి గురవుతున్నారు. వీరిలో కొందరికి గాయిటర్ (గొంతు వద్ద గడ్డ) ఉంటోంది. ఇలా కణితి ఉన్న వారికి ఆపరేషన్ అవసరం లేదు. క్యాన్సర్‌గా మారితేనే ఆపరేషన్ చేయించుకోవాలి. గడ్డలు ఏర్పడ్డ వారిలో 5 శాతం మందిలో మాత్రమే క్యాన్సర్ కణితిలు ఉంటాయి. వీరికి మాత్రమే ఆపరేషన్ చేసి కణితి తొలగించాల్సి ఉంటుంది.

పిల్లల్లో తెలివితేటలపై ప్రభావం

గర్భిణీల్లో ఈ సమస్యను ముందుగానే గుర్తించకపోతే పిల్లల్లో మేధాపరమైన లోపాలు ఉండవచ్చు. చిన్నతనంలోనే ఈ సమస్య గుర్తించడం మంచిది. లేదంటే పిల్లల ఎదుగుదల శారీరకంగానే కాదు మానసికంగా మందగించే ప్రమాదం ఉంది. కాబట్టి సమస్యను త్వరగా గుర్తించి దానికి సరైన చికిత్స పొందడం చాలా ముఖ్యం.

హైపో థైరాయిడ్ లక్షణాలు

నీరసం, మలబద్ధకం, చర్మం, వెంట్రుకలు పొడిబారడం, ఎక్కువ నిద్ర, బరువు పెరగడం, నెలసరిలో రక్తస్రావం లేక తక్కువగా అవ్వడం, గర్భస్రావం, చలిని తట్టుకోలేకపోవడం, గుండె తక్కువసార్లు కొట్టుకోవడం, జుట్టు రాలడం, థైరాయిడ్ గ్రంథి వాపు తదితర లక్షణాలు ఉంటాయి.

హైపర్ థైరాయిడ్ లక్షణాలు

ఆకలి ఎక్కువ కావడం, బరువు తగ్గడం, చెమటలు ఎక్కువగా పట్టడం, చిరాకు, స్థిమితం లేకపోవడం, నిద్రలేమి, నీరసం, ఎక్కువసార్లు విరేచనం అవ్వడం, నెలసరిలో రక్తస్రావం తక్కువగా అవ్వడం, వేడిని తట్టుకోలేకపోవడం, గొంతు ముందు వాపు, గుండె దడ అనిపించడం, కళ్లు పెద్దవిగా అవ్వడం, చేతులు వణకడం వంటివి కనిపిస్తుంటాయి.

థైరాయిడ్ స్థాయి హెచ్చు తగ్గులు

థైరాయిడ్ రిపోర్టులో కనిపించే టి- 3, టి- 4 స్థాయిలు అనేవి మన శరీరంలోని అవయవాల జీవక్రియలకు సంబంధించినవి. అయితే టి-3, టి-4 తయారీకి టీఎస్‌హెచ్ (థైరాయిడ్ స్టిములేటింగ్ హార్మోన్) అనేది అవసరం. ఎప్పుడైతే శరీరంలో టి-3, టి-4 తగ్గుతాయో అప్పుడు వీటి ఉత్పత్తిని పెంచేందుకు టీఎస్‌హెచ్ ఎక్కువగా విడుదల అవుతుంది. అందులో హైపో థైరాయిడ్‌లో టి-3, టి-4 తక్కువగా, టీఎస్‌హెచ్ ఎక్కువగా ఉంటుంది. హైపర్ థైరాయిడ్‌లో పరిస్థితి దీనికి భిన్నంగా ఉంటుంది. మందులు వాడుతున్నా హైపో థైరాయిడ్ అదుపులో ఉండకపోవడానికి అనేక కారణాలు ఉండవచ్చు.

నిర్లక్ష్యం చేయకూడదు

థైరాయిడ్ గ్రంథి వాపు ఉన్నప్పుడు సంబంధిత రక్త పరీక్ష సాధారణంగా ఉన్నంత మాత్రాన ఎలాంటి సమస్య లేదని అనుకోవడానికి లేదు. రక్తపరీక్ష బాగుండి గొంతు ముందు భాగంలో గడ్డలాగా, వాపు లాగా ఉంటే నిర్లక్ష్యం చేయకూడదు. అది కొన్నిసార్లు థైరాయిడ్ క్యాన్సర్ లక్షణం అయి ఉండవచ్చు. కాబట్టి వెంటనే గొంతు స్కాన్ చేయించడం, అవసరమైతే ఆ వాపు నుంచి సూది ద్వారా ముక్క తీసి పరీక్ష చేయడం మంచిది. అయోడిన్ ఉప్పు సరిగ్గా వాడకపోయినా థైరాయిడ్ జబ్బు వస్తుంది. ఇప్పటికీ గ్రామాల్లో రాళ్ల ఉప్పు వాడుతున్నారు. అయోడైజ్‌డు కలిపిన ఉప్పునే కొని వాడాలి. థైరాయిడ్ ఉన్న వారు క్యాబేజి, కాలిఫ్లవర్‌కు దూరంగా ఉండాలి.

వైద్యుల సూచన మేరకు మందులు వాడాలి



థైరాయిడ్ జబ్బుకు వైద్యులు సూచించిన ప్రకారం మందులు వాడుతూ ఉంటే ఏమీ కాదు. హైపోథైరాయిడ్ వారు పరీక్షలో నార్మల్‌గా వస్తే మళ్లీ ఆరు నెలలకు ఒకసారి మాత్రమే పరీక్ష చేయించుకోవాలి. హైపర్ థైరాయిడ్ వారు మూడు నెలలకు ఒకసారి పరీక్ష చేయించుకోవాలి. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో థైరాయిడ్ పరీక్ష ఉచితంగా నిర్వహిస్తున్నాము. ఈ వ్యాధికి అయ్యే మందుల ఖరీదు కూడా చాలా తక్కువ.

–డాక్టర్ పి. శ్రీనివాసులు, ఎండోక్రైనాలజీ విభాగాధిపతి, జీజీహెచ్, కర్నూలు

థైరాయిడ్ క్యాన్సర్‌ను నిర్లక్ష్యం చేయకూడదు



థైరాయిడ్ క్యాన్సర్ చాలా రకాలుగా ఉంటుంది. త్వరగా గుర్తించి చికిత్స అందిస్తే పూర్తి సాధారణ జీవితం గడిపే అవకాశం ఉండవచ్చు. అదే ఆలస్యమైతే పరిస్థితి చేయిజారిపోయే ప్రమాదం ఉంది. సమస్యను గుర్తించి సరైన మందును, సరైన మోతాదులో వాడుతూ ప్రతి ఆరు నెలలకు ఒకసారి పరీక్ష చేసుకుంటూ వైద్యుల పర్యవేక్షణలో ఉండటం అనేది థైరాయిడ్ లాంటి దీర్ఘకాలిక జబ్బుల విషయంలో చాలా ముఖ్యం.

–డాక్టర్ వై. దివ్యలత, ఇంటర్నల్ మెడిసిన్, కర్నూలు

ఈడబ్ల్యూఎంఎస్‌తో నిష్పక్షపాతంగా ఎన్నికలు

కర్నూలు(సెంట్రల్): ఈడబ్ల్యూఎంఎస్(ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్) యాప్‌తో ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించవచ్చని, ప్రతి ఒక్కరూ ఈ యాప్ వినియోగంపై అవగాహన పెంచుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనా అధికారులకు సూచించారు. మంగళవారం కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు ఈడబ్ల్యూఎంఎస్‌యాప్ వినియోగంపై వర్చువల్‌గా జిల్లాలోని ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ఎన్నికల జరిగిన తెలంగాణ, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీష్‌గఢ్, మిజోరం అసెంబ్లీ ఎన్నికల్లో ఈడబ్ల్యూఎంఎస్ యాప్‌ను వినియోగించినట్లు చెప్పారు. ఈ యాప్ ప్రధాన ఉద్దేశం ఎన్నికల్లో నిబంధనలకు విరుద్ధంగా దొరికిన లేదా పట్టుకున్న నగదు, మద్యం, మాదక ద్రవ్యాలు, విలువైన లోహాలు, ఉచిత వస్తువుల డేటాను అప్‌లోడ్ చేయడమేనన్నారు. అలా అప్‌లోడ్ అయిన వస్తువులు, పట్టుబడిన వారి వివరాలపై రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి, జిల్లా ఎన్నికల అధికారులు సమీక్ష చేసి తగు చర్యలు తీసుకుంటారన్నారు. ఈ క్రమంలో వచ్చే ఎన్నికల్లో పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లోనూ ఈడబ్ల్యూఎంఎస్ యాప్‌ను వినియోగిస్తుండడంతో నిర్వహణపై ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు అవగాహన పెంచుకోవాలని సూచించారు. అనంతరం కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు యాప్ వినియోగంపై శిక్షణ ఇచ్చారు. శిక్షణలో కలెక్టర్ డాక్టర్ జి.సృజన, డీఆర్వో కె.మధుసూదన్‌రావు, ఎల్‌డీఎం రామచంద్రరావు, డీటీసీ శ్రీధర్, జిల్లా ఆడిట్ అధికారి రమేష్, గనుల శాఖ అధికారి రాజశేఖర్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ మురళీ పాల్గొన్నారు.

25న అల్లూరి సత్యనారాయణ రాజు జయంతి

కర్నూలు కల్చరల్: ఉస్మానియా కళాశాల చరిత్ర శాఖ ఆధ్వర్యంలో ఈనెల 25వ తేదీన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు అల్లూరి సత్యనారాయణ రాజు 111వ జయంతిని కళాశాల సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల చరిత్ర శాఖ అధ్యక్షుడు షేక్ మసూద్ అహమ్మద్ తెలిపారు. ప్రముఖ చారిత్రక నవలా రచయిత ఎస్‌డీవీ అజీజ్ తెలుగులో రచించిన 'అల్లూరి సత్యనారాయణ రాజు' నవలను పారనంది నిర్మల హిందీలోకి అనువాదం చేసిన పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమం ఉదయం 10 గంటలకు జరుగుతుందని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ సయ్యద్ సమీఉద్దీన్ ముజమ్మిల్ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో క్లస్టర్ యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ డి.వి. ఆర్.సాయిగోపాల్, అల్లూరి సత్యనారాయణ రాజు మూడవ కుమారుడు ప్రముఖ వ్యాపారవేత్త అల్లూరి జితేందర్‌నాథ్ అతిథులుగా పాల్గొంటారని తెలిపారు.

డిగ్రీ కళాశాలల మనుగడను కాపాడుకుందాం



నిరసన తెలుపుతున్న ప్రైవేట్ డిగ్రీ కళాశాలల మేనేజ్‌మెంట్స్ అసోసియేన్ ప్రతినిధులు

కర్నూలు కల్చరల్: ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ) నుంచి డిగ్రీ కళాశాలల మనుగడను కాపాడుకుందామని ఏపీ ప్రైవేట్ డిగ్రీ కళాశాలల మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర ఫైనాన్స్ సెక్రటరీ గుర్రాల వెంకటరెడ్డి పేర్కొన్నారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం రాయలసీమ విశ్వవిద్యాలయంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి వినతి పత్రం సమర్పించారు. అనంతరం వర్సిటీ ఏడీ బిల్డింగ్ వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఐసీటీఈ తాజాగా విడుదల చేసిన హ్యాండ్ బుక్ నిబంధనలు –2024తో ప్రతి రాష్ట్రంలోని డిగ్రీ కళాశాలల్లో టెక్నికల్ కోర్సుల నిర్వహణ ఇబ్బందికరంగా మారుతుందన్నారు. గతంలో బీబీఏ, బీసీఏ, బీహెచ్‌ఎం కోర్సులు రాష్ట్ర ప్రభుత్వ ఉన్నత విద్యా మండలి అనుమతితో నామ మాత్రపు ఫీజు, నామినల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌తో నడిపేవారమన్నారు. తాజా నిబంధనలతో ఆయా కోర్సులు నడపడం ఇబ్బంది అవుతుందన్నారు. ఒక్కో కోర్సుకు రూ.5 లక్షల చొప్పున సెక్యూరిటీ డిపాజిట్ చేయాల్సి ఉంటుందన్నారు. దీన్ని వ్యతిరేకిస్తూ ఈనెల 31వ తేదీ రాష్ట్ర స్థాయిలో విజయవాడలో నిరసన ర్యాలీ చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు వేణుగోపాలాచారి, గౌరవాధ్యక్షుడు శౌరిల్‌రెడ్డి, వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, కళాశాలల కరస్పాండెంట్లు పాల్గొన్నారు.

రైతుల అభ్యున్నతే లక్ష్యం

- చంద్రబాబును నమ్మితే కరువు, కాటకాలే
- పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ ఆధ్వర్యంలో రైతులకు స్వెటర్ల పంపిణీ



రైతుబజారులో స్వెటర్లు పంపిణీ చేస్తున్న పాణ్యం ఎమ్మెల్యే కాటసాని, జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ బెల్లం మహేశ్వరరెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్): రైతుల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం కర్నూలు సి.క్యాంపు రైతుబజారులో జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ బెల్లం మహేశ్వరరెడ్డి తన స్వంత ఖర్చులతో 100 మంది రైతులు, రైతు బజారు సిబ్బందికి చలి నుంచి రక్షణ కల్పించేందుకు స్వెటర్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి పాణ్యం ఎమ్మెల్యే కాటసారి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.. రైతుల సంక్షేమమే లక్ష్యంగా వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం పనిచేస్తుందని, వైఎస్‌ఆర్ రైతుభరోసా కింద పెట్టుబడి సాయం, రూపాయి ప్రీమియం లేకుండా ఉచిత పంటల బీమా, గ్రామాల వారీగా ఆర్‌బీకేలు ఏర్పాటు చేసి రైతుల అభ్యున్నతికి కృషి చేస్తోందని తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో టీడీపీ అధినేత చంద్రబాబు కొత్త, కొత్త హామీలతో ముందుకు వస్తున్నారని, వాటిని నమ్మితే అథోగతే నని స్పష్టం చేశారు. వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ మాట్లాడుతూ... చంద్రబాబు పాలనను ఉమ్మడి రాష్ట్రంలో 9 ఏళ్లు, విభజన తర్వాత 5 ఏళ్లు చూశారని, ఆయన హయాం మొత్తం కరువు, కాటకాలేనని పేర్కొన్నారు. రైతుల కోసం చంద్రబాబు అమలు చేసిన పథకం ఒక్కటంటే ఒక్కటీ లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ ఏడీ నారాయణమూర్తి, ఎస్టేటు అధికారి హరీష్ కుమార్, హార్టీకల్చర్ కన్సల్టెంటు శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు



వొకేషనల్ జూనియర్ కాలేజీలో నేతాజీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్,అధ్యాపకులు

కర్నూలు సిటీ/సెంట్రల్: నగరంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కాలేజీలో జరిగిన వేడుకల్లో కాలేజీ ప్రిన్సిపాల్ ఎస్. నాగస్వామి నాయక్ పాల్గొని నేతాజీ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. మాతృభూమి సేవకు తన జీవితాన్నే అంకితం చేసిన మహనీయుడు నేతాజీ అని ఆయన కొనియాడారు.

- మదర్ థెరిస్సా ఫార్మసీ కాలేజీలో జరిగిన సుభాష్ చంద్రబోస్ జయంతి కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.రవికుమార్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ సురేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.
- స్వాతంత్ర్య సమరయోధుడు సుభాస్‌చంద్రబోస్ ఆశయ సాధనకు కృషి చేస్తామని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కె.జగన్నాథం పేర్కొన్నారు. మంగళవారం సీపీఐ కార్యాలయంలో సుభాష్‌చంద్రబోస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు సీపీఐ నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు పాల్గొన్నారు.

27 నుంచి అంతర్రాష్ట్ర వాలీబాల్ పోటీలు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో అత్యంత వైభవంగా నిర్వహించనున్న నీలకంఠేశ్వర స్వామి జాతర పురస్కరించుకొని స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో ఈ నెల 27వ తేదీ నుంచి వైఎస్సార్ అంతర్రాష్ట్ర వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. టోర్నీకి సంబంధించి పోస్టర్లను మంగళవారం రాత్రి ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి తన నివాసంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బీఆర్ బసిరెడ్డి, భీమిరెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ నజీర్‌అహమ్మద్‌లతో కలిసి ఆవిష్కరించారు. ఆర్గనైజర్లు మాట్లాడుతూ.. క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహించడం కోసం ఎమ్మెల్యే చెన్న కేశవరెడ్డి, సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో విజేతలకు వరుసగా రూ.40,116, రూ.30,116, రూ.20,116, రూ.10,116 నగదు అందించనున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనే జట్లు రూ.500 ఎంట్రీఫీజు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్ 96668 33933, 80740 58451 నంబర్లను సంప్రదించాలన్నారు.

అర్హులైన పేదలందరికీ ఇళ్ల పట్టాలు

- ప్రజా సంక్షేమమే లక్ష్యంగా వైఎస్ జగన్ పాలన
- పాలకొలనులో ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే కాటసాని
- టీడీపీ నాయకులు వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని హితవు



పాలకొలనులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

ఓర్వకల్లు: పేదల సొంతింటి కలను నెరవేర్చడమే లక్ష్యంగా అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తామని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని పాలకొలను గ్రామంలో పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ నాయకుడు రమేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసానితో పాటు మార్కెట్ యార్డు ఛైర్మన్ శ్రీరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, వైఎస్‌ఆర్‌సీపీ జిల్లా నాయకుడు మద్దయ్య, ఎంపీపీ తిప్పన్న, జెడ్పీటీసీ సభ్యుడు రంగనాథ్‌గౌడు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో ముందుగా కాల్వబుగ్గ గురుకుల పాఠశాల నుంచి పాలకొలను గ్రామం వరకు యువత బైక్‌ర్యాలీ నిర్వహించి భారీ గజమాలతో ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకు సుమారుగా 5 వేల పట్టాలు పంపిణీ చేశామన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పాలన సాగిస్తున్నారని చెప్పారు. అయితే, పేదలకు జరుగుతున్న మేలును టీడీపీ నాయకులు ఓర్వలేక తమ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తాను ఫ్యాక్షన్ కుటుంబంలో పుట్టానని.. బెదిరింపు రాజకీయాలకు భయపడే ప్రసక్తేలేదని తేల్చిచెప్పారు. ఎదుటి వ్యక్తులను రెచ్చగొట్టి మాట్లాడడం టీడీపీ నాయకులకు వెన్నతో పెట్టిన విద్య అని అన్నారు. రాజకీయ నాయకులకు సభ్యత, సంస్కారం ముఖ్యమని, ఈ విషయం ప్రతిపక్షపార్టీల నాయకులు తెలుసుకోవాలని హితవుపలికారు.

– ప్రజల చిరకాల కోరిక నెరవేర్చాం

పాలకొలను గ్రామ ప్రజల చిరకాల కోరికను నెరవేర్చిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కిందని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. గ్రామంలో అర్హులైన 320 కుటుంబాలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా గ్రామస్తుల విన్నపం మేరకు డీఆర్‌డీఓలో భూములు కోల్పోయిన బాధితులందరికీ పరిహారం మంజూరుకు కృషి చేస్తానని హామీచ్చారు. ఆక్రమణల నుంచి చెరువును కాపాడుతామని, ఈ విషయంపై త్వరలో అధికారులతో మాట్లాడుతానన్నారు.అంతకు ముందు గ్రామా నికి సంబంధించిన వివిధ సమస్యలను యువనాయకుడు రమేష్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. గ్రామ శివారులోని చెరువుకు హంద్రీనీవా ప్రాజెక్టు నుంచి నీరందించాలని, పురాతన వెంకటేశ్వరస్వామి దేవాలయాలన్ని అభివృద్ధి చేయాలని కోరారు. కార్యక్రమంలో సింగిల్ విండో ఛైర్మన్ నాగతిరుపాలు, జేసీఎస్ మండల కన్వీనర్ లోటర్‌బాషా, చింతలపల్లె ఉపసర్పంచు వెంకటస్వామి, కాల్వబుగ్గ ఆలయ ట్రస్టుబోర్డు ఛైర్మన్ గుర్రాల చెన్నారెడ్డి, స్థానిక నాయకులు వెంకటసుబ్బారెడ్డి, వెంకటరామిరెడ్డి, మాజీ సర్పంచు కత్తి వెంకటరమణ, రమేష్, వివిధ గ్రామాల ఎంపీటీసీ సభ్యులు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, సోమశేఖరరెడ్డి, నాగిరెడ్డి, పుల్లయ్య, మండల నాయకులు కాల్వ వెంకటేశ్వర్లు, ప్రభాకర్‌రెడ్డి, జీకే వెంగన్న, మాజీ సర్పంచు చిన్న అయ్యన్న తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

ఓర్వకల్లు: వర్షాభావ పరిస్థితుల కారణంగా రానున్న వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అధికారులకు ఆదేశించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ తిప్పన్న అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఎమ్మెల్యే కాటసానితో పాటు మార్కెట్ యార్డు ఛైర్మన్ శ్రీరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు, ఎంపీడీఓ శివనాగప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సమావేశంలో ముందుగా వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనుల నివేదికలను సంబంధిత అధికారులు చదివి వినిపించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నీటి ఎద్దడి గల గ్రామాలను గుర్తించి ఆయా గ్రామాల్లో ట్యాంకుల ద్వారా నీరు సరఫరా చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. రీ సర్వేలో భూముల విస్తీర్ణంలో అవకతవకలతో నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలన్నారు. ఏపీఐఐసీలో భూములు కోల్పోయిన రైతుల కుటుంబాలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కలిసి ప్రజలకు సేవలు అందించాలని తెలిపారు. సమావేశంలో మండల ఉపాధ్యక్షుడు పద్మనాభరెడ్డి, డీటీ సతీష్, వివిధ శాఖల అధికారులు, ఇంజినీర్లు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు



విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్

కల్లూరు: విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని కల్లూరు అర్బన్ 32వ వార్డు కార్పొరేటర్ సాన శ్రీనివాసులు అన్నారు. మంగళవారం ముజఫర్ నగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న 112 మంది విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రభుత్వం డిజిటల్ విద్యను ప్రోత్సహిస్తుందన్నారు. మనబడి నాడు-నేడు పథకం ద్వారా పాఠశాలల రూపురేఖలు మారాయని అన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా నాణ్యమైన విద్య అందుతుందన్నారు. విద్యార్థులకు జగనన్న గోరు ముద్ద పథకం ద్వారా నాణ్యమైన భోజనం అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు శివ, నాయకులు ఇస్మాయిల్, షేక్షావలి, ఉస్మాన్, హుస్సేన్ సాహెబ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకోవాలి

ఓర్వకల్లు: సాంకేతిక విద్యను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం అందజేస్తున్న ట్యాబ్‌లను విద్యార్థులు సక్రమంగా వినియోగించుకోవాలని కర్నూలు మార్కెట్ యార్డు ఛైర్మన్ మీదివేముల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని మీదివేముల జెడ్పీ హైస్కూల్‌లో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు.